క్లుప్తంగా

నేడు ప్రత్యేక లోక్అదాలత్

పుంగనూరు: పట్టణంలోని కోర్టు ఆవరణలో శనివారం ప్రత్యేక లోక్అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. లోక్అదాలత్‌లో వరకట్నం కేసులు, విడాకులు, మనోవర్తి కేసులను మాత్రమే పరిష్కరిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లక్కనపల్లెలో గంధోత్సవం నేడు

పలమనేరు: బైరెడ్డిపల్లె మండలం లక్కనపల్లెలోని హజ్రత్ ఖ్వాజా గరిబున్ నవాజ్ దర్గాలో శనివారం రాత్రి గంధోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఆదివారం రాత్రి 8 గంటలకు షాబాజ్, అస్మానిఖత్‌లతో ఖవ్వాలి జరుగుతుందన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఎంపీపీ ఎల్లప్ప

సదుం: ఇద్దరు బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎంపీపీ ఎల్లప్ప శుక్రవారం పంపిణీ చేశారు. తాటిగుంటపాలెంకు చెందిన లితేష‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందారు. ఆయనకు రూ. 1.60 లక్షలు, గొంగివారిపల్లెకు చెందిన మల్లేశ్వరరెడ్డికి రూ. 18 వేల చెక్కును అందజేశారు. ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున, నాయకులు గిరిధర్‌రెడ్డి, నారాయణరెడ్డి, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కంటైనర్ బోల్తా

గంగవరం: బెంగళూరు నుంచి రాణిపేటకు వెళ్తున్న కంటైనర్ లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన మండల పరిధిలోని బెంగళూరు- పలమనేరు జాతీయ రహదారి నాలుగురోడ్ల కూడలి వద్ద చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని హిటాచీ సాయంతో కంటైనర్‌ను పక్కకు తొలగించారు.

విరూపాక్షి మారెమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో మారెమ్మ


పుంగనూరు: పట్టణంలోని శ్రీవిరూపాక్షి మారె మ్మ ఆలయంలో శుక్రవారం రాహుకాల పూజ లు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలతో సుందరంగా అలంకరించి పూజలు చేశారు. వేకువజాము నుంచే భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి చలిపిండి, చల్లముద్దతో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ


దాతలు అందజేసిన డెస్క్‌టాప్

పెద్దపంజాణి: మండలంలోని రాజుపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలకు హెచ్‌సీఎల్ కంపెనీ ప్రతినిధులు శుక్రవారం డెస్క్‌టాప్ వితరణ చేశారు. ఈ సందర్భంగా కంపెనీ ప్రతినిధులు అమరనాథ్, ప్రేమ్‌కుమార్‌లకు పాఠశాల హెచ్‌ఎం గౌరీ శంకర్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి తమ్మిరెడ్డి, పార్టీ నాయకుడు కృష్ణప్ప, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన


చీలంపల్లెలో పంటను పరిశీలిస్తున్న అధికారులు

బైరెడ్డిపల్లె: మండల పరిధిలో గురువారం రాత్రి కురిసిన వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అధికారులు, వీఆర్వోలు పరిశీలించారు. కాగా వర్షాలతో ఉద్యానవన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. చేతికందిన పంటలు నేలమట్టమయ్యాయి. తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దగ్ధమైన పూరిల్లు పరిశీలన


బాధితుడితో మాట్లాడుతున్న వీఆర్వో

కుప్పంరూరల్: పిడుగుపాటుకు దగ్ధమైన పూరింటిని వీఆర్వో వెంకటేష్, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు మల్లప్ప శుక్రవారం పరిశీలించారు. మండల పరిధిలోని పూరాల గుండచేను గ్రామానికి చెందిన కనకప్ప ఇంటిపై పిడుగుపడడంతో ఆయన భార్య చిన్నమ్మ, మనువరాలు కదిరప్ప గాయపడి కుప్పం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాధితుడి ఇంటిని పరిశీలించి నష్టాన్ని అంచనా వేశారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామని వీఆర్వో వెంకటేష్ తెలిపారు.


వయోలిన్ వాయిస్తున్న రత్నం మాస్టారు

కళపై ఉన్న మక్కువ, తల్లిదండ్రుల ప్రోత్సాహం ఆయన్ను 15 ఏళ్లలోనే హరికథ దాసును చేసింది. ఓ వైపు హరికథలు చేస్తూనే హార్మోనియం, వయోలిన్, తబలా, సంగీతంలోనూ ప్రావీణ్యం సంపాదించారు. తన 35వ ఏటనే స్వర్ణ హస్త కంకణ బిరుదును పొందారు. తనకు తెలిసిన విద్యను వందల మందికి పంచిన ఆయన తొమ్మిది పదుల వయసులోనూ అదే ఒరవడిని కొనసాగిస్తున్నారు.

కళా‘రత్నం’


శిష్యులకు వయోలిన్ శిక్షణనిస్తూ..

- 76 ఏళ్లుగా కళామతల్లి సేవ
- హరికథ భాగవతార్, వయోలిన్ విద్వాంసకుడిగా గుర్తింపు
- 56 ఏళ్ల క్రితమే సువర్ణ హస్త కంకణ సత్కారం
- వందల మందికి విద్యను పంచుతున్న జీఎం రత్నం భాగవతార్

శాంతిపురం/కుప్పం రూరల్: కుప్పం మండలం కమతమూరు పంచాయతీ గుండ్లపల్లికి చెందిన మాదాలం గోవిందప్ప గారి రత్నం (91) హరికథా భాగవతార్‌గా తన ప్రతిభతో అపార ఖ్యాతిని సంపాదించారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో తన 12వ ఏటనే హరికథలు నేర్చుకోవడానికి పూనుకున్న ఆయన తర్వాత అనుబంధ కళల్లోనూ పట్టు సంపాదించారు. హరికథల్లో కీలక వాయిద్యాలైన వయోలిన్, హార్మోనియం, తబలాలతో రాగాలు పలికించడంలో దిట్టగా పేరు పొందారు. సంగీతంపై మమకారం తీరక సంగీత సాధనతో సంప్రదాయ సంగీతంలోనూ ప్రావీణ్యం పొందారు. వయసు మీద పడటం, ప్రదర్శనల సంఖ్య తగ్గడంతో ఆయా కళల్లో గురువుగా మారి వేల మందికి సంగీత విద్యను అందిస్తూ రత్నం మాస్టారుగా సేవలను కొనసాగిస్తున్నారు.

తొలుత అయిష్టంగానే..

తన తల్లిండ్రులు గోవిందప్ప, వెంకటమ్మల కారణంగానే హరికథలు నేర్చుకోవడానికి అయిష్టంగానే తాను పూనుకున్నానని రత్నం మాస్టారు చెప్పారు. మైసూరు సంస్థానంలో ఆస్థాన విద్వాంసకుడిగా పని చేసిన కుప్పానికి చెందిన వెంకటగిరి వద్ద హరికథను నేర్చుకున్నానని చెప్పారు. నాలుగేళ్ల శిక్షణ, సాధన తర్వాత హరికథ భాగవతార్‌గా తన ప్రస్థానం ప్రారంభమైందన్నారు. తర్వాత ఒంగోలుకు చెందిన లక్ష్మీరమణ వద్ద 3 నెలలు వయోలిన్, తన అన్న మునస్వామి వద్ద హార్మోనియం నేర్చుకున్నానని తెలిపారు. కానీ కళాకారుడిగా మారడంతో ఆరో తరగతితోనే తన చదువు ముగించాల్సి వచ్చిందని ఒకింత ఆవేదన వ్యక్తం చేశారు. రెండు ఎకరాల పొలం, పాత ఇంటిలోనే జీవితం నెట్టుకొస్తున్నామన్నారు.

గుర్తింపుతో ఉత్సాహం

హరికథా భాగవతార్‌గా 70వ దశకంలో శ్రీకాళహస్తి ఆలయ కార్యక్రమంలో చెప్పిన భాగవతం తనకు మరువలేని గుర్తింపును, తృప్తిని ఇచ్చాయని రత్నం మాస్టారు నాటి జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. తన ప్రతిభను మెచ్చుకుంటూ నాటి కార్యక్రమ నిర్వహకుడు జూలకంటి నారాయణశెట్టి స్వర్ణ హస్తకంకణ బిరుదును, కంకణాన్ని బహూకరించారని గుర్తు చేసుకున్నారు. మరో పదేళ్ల తర్వాత హైదరాబాద్‌లో జరిగిన కథా పోటీల్లో నాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు చేతుల మీదుగా సత్కారం అందుకున్నారని చెప్పారు. ఎందరో మహానుభావులు తనకు కార్యక్రమాలు, ప్రశంసలు, బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారని అన్నారు. ఈ ఉత్సాహంతోనే వయోలిన్, హార్మోనియం, తబలా, సంప్రదాయ సంగీతం నేర్చుకున్నారని వివరించారు. ఉమ్మడి చిత్తూరు, కడప జిల్లాలతో పాటు బెంగళూరు పట్టణంతో సహా కర్ణాటకలోని వివిధ ప్రాంతాల్లో భాగవతార్‌గా, వయోలిన్, తబలా ఆర్టిస్టుగా వేల కొద్దీ ప్రదర్శలు ఇచ్చానని జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు.


శిష్యురాలు చైత్ర హరికథా ప్రదర్శనలో హార్మోనియం మాస్టారుగా.. (ఫైల్)


శ్రీకాళహస్తిలో బహుకరించిన స్వర్ణ కంకణం

వేల మందికి గురువుగా..

తనకు తెలిసిన విద్యను నలుగురికీ నేర్పి వారిని కళాకారులుగా తీర్చిదిద్దేందుకు రెండు దశాబ్దాలుగా కృషి చేస్తున్న రత్నం మాస్టారు ఇప్పటికే వేల మందికి ఆ కళలను పంచారు. శాంతిపురం, కుప్పం మండలాల్లో ఎందరినో హరికథ దాసులుగా, వయోలిన్ విద్యాంసులుగా, హార్మోనియం-తబలా మాస్టర్లుగా, గాయకులుగా తీర్చిదిద్దారు. వందల మంది కళా ప్రదర్శనలతో ఉపాధి పొందుతున్నారు. తన వద్ద హరికథలు నేర్చిన కుప్పానికి చెందిన చైత్ర, చైతన్యలు రాష్ట్ర స్థాయిలో పలు పురస్కారాలు, ప్రశంసలు పొందారు. పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది కుమార్తె అనుషరెడ్డి హైదరాబాద్‌లో జరిగిన తెలుగు రాష్ట్రాల అంతర్ పాఠశాలల కల్చరల్ పోటీల్లో వయోలిన్, అన్నమయ్య కీర్తనల గానంలో తొలి బహుమతులతో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించింది. శిష్యుల విజయ పరంపర కొనసాగుతూ, తన చివరి క్షణం వరకూ సంగీతం నేర్పుతూ ఉండే వరాన్ని దేవుడు ఇస్తే చాలని రత్నం మాస్టారు చేతులు జోడిస్తున్నారు.

ఉగాది క్యాలెండర్ల ఆవిష్కరణ

పలమనేరు: త్రైతసిద్ధాంత ఉగాది క్యాలెండర్లను పలమనేరు ఎస్‌ఐలు నాగరాజు, సుబ్బారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం ఆవిష్కరించారు. ప్రబోధానంద యోగీశ్వరుల ఆశీస్సులతో ఏటా ఉగాది క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్నట్లు స్థానిక ప్రబోధ సేవాసమితి నిర్వాహకులు భాస్కర్, జ్యోతి, సరళ, రోజా తెలిపారు.


క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎస్‌ఐలు

20వ తేదీ వరకు సహకార బంధు పథకం

పుంగనూరు: డీసీసీ బ్యాంకులో సహకార బంధు పథకాన్ని ఈనెల 20 తేదీ వరకు కొనసాగిస్తున్నట్లు చీఫ్ మేనేజర్ రాధారాణి తెలిపారు. బ్యాంకు ఆదాయాన్ని పెంచేందుకు వివిధ రకాల పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సీనియర్ సిటిజన్లకు 8 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు తెలిపారు. అలాగే రూ. వెయ్యి నుంచి డిపాజిట్లు స్వీకరిస్తామని చెప్పారు. డిపాజిట్‌దారులకు ఇన్సూరెన్స్ రక్షణ కల్పిస్తామన్నారు. విరివిగా రుణాలు మంజూరు చేస్తున్నామని తెలిపారు. అసిస్టెంట్ మేనేజర్ నాగప్రసాద్ పాల్గొన్నారు.


కరపత్రాలను పంపిణీ చేస్తున్న చీఫ్ మేనేజర్

ఎంబీబీఎస్ ఫలితాల్లో పీఈఎస్ విజయకేతనం

గుడుపల్లె: వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ విడుదల చేసిన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్ష ఫలితాల్లో పీఈఎస్ మెడికల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ క్రిష్ణరావు తెలిపారు. మొత్తం 87 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. డిస్టింక్షన్‌లో 9 మంది, ఫస్ట్ క్లాస్‌లో 81 మంది, సెకండ్ క్లాస్‌లో 40 మంది పాస్ అయినట్లు వివరించారు. సాయి జాహ్నవి 81 శాతం, పవిత్ర 71 శాతం, రమేష్ తరుణ్ 78, మహేంద్రరెడ్డి 78, కౌశిక్ 77, సుదేష్ణ 76, స్వర్ణ సుమనా76, వకుళదేవి 76 హర్షిని 76 శాతంతో టాపర్లుగా నిలిచారన్నారు.


సాయిజాహ్నవి, పవిత్ర, రమేష్ తరుణ్

వరి సస్యరక్షణతో అధిక దిగుబడి


బొమ్మాయిపల్లెలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ మధుసూదన్‌రెడ్డి, ఏఓ పద్మజ

బంగారుపాళెం: వరి సాగులో రైతులు సస్యరక్షణ చర్యలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని చిత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకులు(ఏడీఏ) మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పలుగ్రామాల్లో శుక్రవారం సిబ్బందితో కలసి రైతు భరోసా కేంద్రాలు, క్షేత్రస్థాయిలో పొలంబడి క్షేత్రాన్ని తనిఖీ చేశారు. తొలుత మండలంలోని పాలేరు గ్రామంలోని రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామ సభ కార్యక్రమంలో పాల్గొని రబీ సీజన్‌లో పంట నమోదు జాబితా ప్రదర్శన గురించి వివరించారు. రైతులకు పంటల సాగుపై సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. తిమ్మోజుపల్లె ఆర్‌బీకే పరిధిలోని బొమ్మాయిపల్లెలో నిర్వహిస్తున్న పొలంబడి క్షేత్రాన్ని సందర్శించారు. రైతులకు పొలంబడి ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. సేంద్రియ పద్ధతుల్లో వరి సాగు వల్ల కలిగే ప్రయోజనాలు, జీవామృతం తయారీ విధానం, తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి, ఆదాయం పొందడానికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. పంటల సాగు కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్‌బీకే చానల్‌ను రైతులు సబ్‌స్క్రైబ్ చేసుకోవాలని సూచించారు. పంట సాగు విధానంలో అనుసరించే పలు విధానాలు తెలుసుకునేందుకు చానల్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని గుండ్లకట్టమంచి గ్రామంలో నిర్మిస్తున్న రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. పనులు సకాలంలో పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పద్మజ, ఏఈఓ సాదరయ్య, ఆర్‌బీకే సిబ్బంది పుష్పాంజలి, లావణ్య, మూర్తి, ఆనంద్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 48 మంది గైర్హాజరు

పుంగనూరు: ఇంటర్మీడియెట్ తొలి సంవత్సరం పరీక్షలకు 48 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పట్టణంలో శుక్రవారం మూడు సెంటర్లలో పరీక్షలు జరిగాయి. మొత్తం 891 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 48 మంది విద్యార్థులు హాజరుకాలేదని పర్యవేక్షణాధికారులు రెడ్డెప్ప, కమలాకర్, విజయ కుమారి తెలిపారు.

సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక పూజలు


విశిష్ట అలంకరణలో స్వామివారు

రామకుప్పం: స్థానిక సుబ్రమణ్యస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వల్లీదేవసేన సమేత సుబ్రమణ్యస్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

చెరువు కట్ట సమస్యను పరిష్కరించండి

రామకుప్పం: స్థానిక నాగమ్మ చెరువు కట్టను పరిరక్షించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. చెరువు కట్ట దిగువ ఉన్న పొలాలకు వెళ్లడానికి దారి లేకపోవడంతో కొందరు రైతులు కట్టకింద ఉన్న కొంత భూమిని చదును చేసి రోడ్డును ఏర్పాటు చేసుకున్నారు. అయితే చుట్టుపక్కల పొలాల రైతులు కట్టకింది భాగం చదును చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. భవిష్యత్‌లో ప్రమాదాలు ఎదురవుతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దారి లేకపోవడంతో పొలాలకు ఎలా వెళ్లాలని మరో వర్గం రైతులు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

దుప్పట్ల పంపిణీ


దుప్పట్లను పంపిణీ చేస్తున్న దాతలు

సదుం: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలోని పారిశుధ్య కార్మికులు, రోగులకు శుక్రవారం దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. హరినాథరెడ్డి దంపతులు దుప్పట్లు, దిండులను వితరణగా అందించినట్లు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి తెలిపారు. అలాగే హరినాథరెడ్డి, రెడ్డివారిపల్లె సర్పంచ్ హనుమంతరెడ్డి మందుల కొనుగోలుకు రూ. 2 వేల చొప్పున అందించారని చెప్పారు. డాక్టర్ శ్రీధర్‌బాబు, లయన్స్ క్లబ్ సభ్యులు మనోజ్ రెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

పర్వతరెడ్డికి శుభాకాంక్షలు

పలమనేరు: ఉమ్మడి ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించిన వైఎస్సార్‌సీపీ అభ్యర్థి పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డిని పలమనేరుకు చెందిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘం నేతలు శుక్రవారం చిత్తూరులో కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. వారిలో వైఎస్సార్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు కృష్ణమూర్తిరెడ్డి, ఉపాధ్యాయ సంఘం నాయకులు కోటేశ్వర్‌రెడ్డి, పట్టాభిరెడ్డి, జైపాల్ రెడ్డి ఉన్నారు.


శుభాకాంక్షలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఇంటి పన్నుపై వడ్డీ మినహాయింపు

పుంగనూరు: మున్సిపాలిటీ పరిధిలో వడ్డీ లేకుండా ఆస్తి పన్ను చెల్లింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో మొత్తం పన్నులు రూ.5.22 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. ఇందులో రూ. 2.94 కోట్లు వసూలైందని.. మరో రూ.2.28 కోట్లు వసూలు కావాల్సి ఉందన్నారు. ఇందులో సుమారు రూ. 86 లక్షల వడ్డీని ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. పట్టణంలో ఆస్తులు కలిగిన యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సత్వరమే వడ్డీ లేకుండా పన్నులు చెల్లించాలని కోరారు. ఈ మేరకు మున్సిపాలిటీలోని 16 సచివాలయాలకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు.


కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయం ఉత్తమం


అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రొంపిచెర్ల: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం, పర్యావరణాన్ని రక్షించుకోవచ్చని ఐబీఎంపీ వేణి అన్నారు. మండలంలోని పెద్దమల్లెల, వారణాసివారిపల్లె గ్రామాల్లో రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంతో పంటల ఖర్చు తగ్గుతుందని తెలిపారు. అలాగే మంచి దిగుబడి సాధించవచ్చన్నారు. ఎండ కాలాన్ని దృష్టిలో పెట్టుకుని 32 రకాల చిరుధాన్యాలను సాగు చేయాలని సూచించారు. బీడు భూముల్లో బంతుల రూపంలో విత్తనాలను చల్లితే అవి 6 నెలల వరకు భూమిలో చెడిపోకుండా ఉంటాయని తెలిపారు. వర్షం పడితే మొలకలు వస్తాయన్నారు. వాన పాములు, సూక్ష్మ పురుగులకు నష్టం కలగదని చెప్పారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు రెడ్డెమ్మ, ఉష, రేఖా పాల్గొన్నారు.

కవితశ్రీకి సుజన సాహితీ పురస్కారం

పలమనేరు: పలమనేరుకు చెందిన కవి, రచయిత దివంగత కరణం శేషపిళ్లై జ్ఞాపకార్థం అందజేసే సుజనసాహితీ పురస్కారానికి ప్రముఖ కవి, సాహితీ విమర్శకురాలు కవితశ్రీ ఎంపికైన నట్లు పలమనేరు రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు మాధవ్ తెలిపారు. వాల్మీకిపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న కవితశ్రీ అలియాస్ దేరంగుల శ్రీనివాసులు ఇదట దమ్ముదులపబడును అనే సాహిత్య విమర్శా సంపుటితో సాహితీ విశ్లేషకుల ప్రశంసలు అందుకున్నారని పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని కళామందిరంలో జరిగే కార్యక్రమంలో నగదు పురస్కారంతో పాటు సన్మాన కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.


కవితశ్రీ

కుటీర పరిశ్రమల స్థాపనతో ఆర్థికాభివృద్ధి

గంగాధరనెల్లూరు: స్వయం సహాయక సంఘ సభ్యులు కుటీర పరిశ్రమల స్థాపనపై మొగ్గు చూపాలని డీఆర్‌డీఏ పీడీ తులసి కోరారు. మండలంలోని బొమ్మవారిపల్లెలో కాయర్ బోర్డు(మేట్ల) తయారీ శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న శిక్షణను సంఘ సభ్యులు వినియోగించుకోవాలన్నారు. శిక్షణానంతరం కుటీర పరిశ్రమను ప్రారంభించి ఉత్పత్తులను మార్కెట్‌లో విక్రయించుకుంటే లాభాలు పొందవచ్చన్నారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని తెలిపారు. అనంతరం కలిజవేడు, పాపిరెడ్డిపల్లె సచివాలయాలను తనిఖీ చేశారు. ఏపీఎం చిరంజీవి, రూరల్‌యాక్షన్ సంస్థ సెక్రటరీ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

శాస్త్రోక్తంగా మహా కుంభాభిషేకం

ఐరాల: మండల కేంద్రంలో శ్రీ పాలేటమ్మ ఆలయ మహా కుంభాభిషేకం శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేకువజామున 2 గంటలకు అర్చకులు పాలేటమ్మ నూతన రాతి విగ్రహానికి ప్రాణప్రతిష్ట చేసి విగ్రహం ప్రతిష్టాపన కార్యక్రమం నిర్వహించారు. యాగశాలలో వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ హోమాలు, అంకుర్పారణ, వాస్తు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 10 గంటల మధ్య ఆలయ మహా కుంభాభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారికి భక్తులు పసుపు, కుంకుమ, చీరలను సమర్పించారు. అనంతరం ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ఎం.కే.బాలాజి, గ్రామస్తులు పాల్గొన్నారు.


హోమం నిర్వహిస్తున్న అర్చకులు

అకాల వర్షం.. అపార నష్టం


వర్షానికి నెలకొరిగిన మొక్కజొన్న పంట

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లె, కొల్లుపల్లె గ్రామాల్లో శుక్రవారం వడగండ్ల వర్షం భీభత్సం సృష్టించింది. రెండు గ్రామాల్లోనూ పెద్ద ఎత్తున గాలులతో వాన కురవడంతో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడింది. అదేవిధంగా మొక్కజొన్న (స్వీట్‌కార్న్), బీన్స్, టమాట నేలకొరిగాయి. కాయలు ధ్వంసం అయ్యాయి. పంట చేతికొచ్చే సమయంలో వడగండ్లు, గాలుల ధాటికి తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.